క్లుప్తంగా

నిలిచిపోయిన సేవలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం గం.1.00ల నుంచి ఎక్స్‌రే సేవలు నిలిచిపోయినట్లు పలువురు రోగులు, వారి బంధువులు వాపోయారు. ఏరియా ఆస్పత్రిలో ఎక్స్‌రేకు సంబంధించిన ఫిల్మ్ అయిపోవడంతోనే సేవలకు ఆటంకం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను సాక్షి వివరణ కోరగా.. ఫిల్మ్‌లు ఆస్పత్రికి చెరవలసిన సమయంలో చెరకపోవడంతో ఈ సమస్య ఏర్పడినట్లు తెలిపారు.

ఖాజీగా షబ్బీర్‌హుసేన్

చంద్రుగొండ: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల ఖాజీగా (గెజిటెడ్‌హోదా) మహ్మద్ షబ్బీర్‌హుసేన్‌ను నియమిస్తూ ప్రిన్స్‌పల్ సెక్రటరీ మైనారిటీస్ నదీం అహ్మద్ జీఓ విడుదల చేశారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు ఖాజీగా నియామకపు పత్రాన్ని షబ్బీర్‌హుసేన్‌కు అందించారు. స్థానిక ముస్లిం యువకులు షబ్బీర్‌హుసేన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యండి.సాబీర్ హుసేన్, ఎండీ అష్రఫ్‌హుసేన్, నాగుల్‌మీరా, ఇబ్రాహీంసాబ్, కమల్‌షా, కరీముల్లా, యాకుబ్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల గ్రామంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరిగే శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర గోడప్రతులను ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర మంగళవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. జాతర ఏర్పాట్లను ఆదివాసీ తెగల సమన్వయ కర్త చుంచు రామక్రిష్ణ ఆధ్వర్యంలో జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో సమ్మక్క–సారలమ్మ ఆలయ కమిటీ ధర్మకర్తలు చందా భిక్షపతి, చందా భూపతయ్య, వీరయ్య, గోవర్ధన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో చేర్చాలి

భద్రాచలం: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధులకు చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, భద్రాచలం బృందం జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు, అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో తొలుత వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర శాఖ నుంచి వచ్చిన పది లక్షల రూపాయల విలువ గల రిలీఫ్ మెటీయర్ పంపిణీని కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ నిధులతో దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించనున్నట్లు వెల్లడించారు. కన్వీనర్ డా.ఎస్ఎల్ కాంతారావు, జిల్లా కోఆర్డినేటర్ వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, కామేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నగదు బదిలీ చేయండి

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా యాదవ్, కురుమల అకౌంట్‌లలోకి నేరుగా నగదు బదిలీ చేయాలని తెలంగాణ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (జీయంపీయస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లి సత్యనారాయణ, కుమ్మరి కుంట సాంబశివరావులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తూరుబాక గ్రామంలో జరిగిన గొర్రెల మేకల సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. నగదు బదిలీతో అవినీతికి తావుండదని అన్నారు. కార్యక్రమంలో నలగట్ల ప్రభాకర్, బూడిద. ప్రసాద్, చిలక వెంకన్న, వీరస్వామి, ఐనబోయిన శ్రీను, కుమ్మరికుంట. ప్రవీణ్, కందుల నరసింహారావు పాల్గొన్నారు.

30న ఆత్మీయ సమ్మేళనం

మణుగూరుటౌన్: ఈనెల 30న పినపాక నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమ్మేలనాన్ని జయప్రదం చేయాలని మాదిగల ఐక్యవేదిక అధ్యక్షుడు రావులపల్లి రాంమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరు హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమ్మేళనంలో పాల్గొని మాదిగల ఐక్యతను చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ రిజియన్ ఇన్‌చార్జ్ కాటిపేట కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎస్ కుమారస్వామి, ఎం.నర్సింహారావు, కుర్రి రాజేశ్వరరావు, రాజేష్, జగన్మోహన్, కోటేశ్వరరావు, నైనారపు నాగేశ్వరరావు, డీసీసీబి మాజీ డైరెక్టర్ బోయిళ్ల రమణయ్య, లాయర్ సాంబ, పాడుతూరి ప్రసాద్, కృష్ణ, బోయిళ్ల రాజు,విక్రమ్, రమేష్, మల్లేష్, మంద హుస్సేన్, వున్నారావు, సిద్దెల తిరుమలరావులు పాల్గొన్నారు.

పట్టాలపై స్పష్టత ఇవ్వాలి

దుమ్ముగూడెం: ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ సభలో పోడు భూములకు పట్టాలు, తునికి ఆకు బోనస్ గురించి స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు.మంగళవారం పెద్ద బండిరేవు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సోయం వీర్రాజు, నుపా రామారావ్, దబ్బా సురేందర్, కనితి చంటి, కనితి నాగేశ్వరావు, పూనం లక్ష్మి, సున్నం రాధా పాల్గొన్నారు.

పోషణ లోపంపై ఫోకస్

- సరైన ఆహారం, చర్యలతో ముందుకు..
- అంగన్‌వాడీల భుజాలపై ఆ బాధ్యతలు
- సహకరిస్తున్న ఆశావర్కర్లు, ప్రజాప్రతినిధులు
- 2026 నాటికి పోషణ లోపాన్ని అధిగమించడమే లక్ష్యం


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న పిల్లలు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: నాణ్యమైన విద్యతోపాటు చిన్నారులు చిన్నతనం నుంచే ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా అంగన్‌వాడీ స్థాయిలోనే కొద్దిగా తీవ్రలోప పోషణ (ఎంఏఎం), అతి తీవ్రలోప పోషణ (ఎస్‌ఏఎం)తో బాధపడుతున్న పిల్లలను గుర్తించి.. వారికి సరైన పోషకాహారం, వైద్యసేవలు అందేలా చేస్తోంది.

పిల్లల జబ్బ చుట్టూ కొలత 11.5 సెంటీమీటర్ల నుంచి 12.4 సెంటీమీటర్లు ఉంటే కొద్దిగా తీవ్ర లోప పోషణ (ఎంఏఎం).. 11.4 సెంటీమీటర్లు లేదా అంతకంటే తక్కువగా ఉంటే అతి తీవ్ర లోప పోషణ(ఎస్‌ఏఎం) ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటారు. అంగన్‌వాడీల్లో ఆరేళ్ల వయసు వరకు పిల్లల్లో ఎంఏఎం, ఎస్‌ఏఎం ఎంత మంది ఉన్నారనేది గుర్తించి, వారికి కావాల్సిన పోషకాహారంతోపాటు వైద్య సేవలు అందిస్తే చిన్న వయసులోనే సమస్యలు అధిగమించవొచ్చు. దుమ్ముగూడెం ప్రాజెక్ట్ పరిధిలో 6,084 మంది పిల్లలు ఉండగా అందులో ఎంఏఎం 348, ఎస్‌ఏఎం 104, ఎస్‌యూడబ్ల్యూ 107, ఎంయూడబ్ల్యూ 510 మంది ఉన్నారు.

మరోవైపు పిల్లల బరువు పెరుగుదల వారి వయస్సుకు తగ్గట్టుగా ఉండాలి. 0–3 నెలలు వయస్సున్న పిల్లలు వారానికి 200 గ్రాముల చొప్పున పెరగాలి. 4–6 నెలలు వారు 150 గ్రాములు, 7–9 నెలల పిల్లలు 100 గ్రాములు, 10–12 నెలలు పిల్లలు 50–75 గ్రాములు పెరగాల్సి ఉంటుంది. 1–2 ఏళ్ల పిల్లలు ఏడాదికి 2.5 కిలోల బరువు పెరగాలి. 3 నుంచి 5 ఏళ్ల వయస్సు మధ్యన ఉన్న వాళ్లు 2 కిలోల చొప్పున పెరగాల్సి ఉంటుంది. వీటిల్లో ఏ లోపమున్నా చర్యలు తప్పనిసరి.

పోషకాహారమే ఆయుధంగా..

అతి తీవ్రలోపపోషణ(ఎస్ఎం), కొద్దిగా తీవ్రలోప పోషణ (ఎంఏఎం) కలిగిన పిల్లలను బాగు చేయడంతో పోషకాహార చికిత్స చాలా కీలకం. ఈ సమస్య ఉన్న పిల్లలకు ఎక్కువ శక్తిని ఇచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, మాంసకృత్తులతో కూడిన రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలి. ఆ దిశగా అంగన్‌వాడీలు కృషి చేస్తున్నారు. ఎంఏఎం పిల్లలు రోజులో ఐదుసార్లు, ఎస్‌ఏఎం పిల్లలు రోజుకు ఆరుసార్లు బాలామృతం, అరటిపండు, గుడ్డు, పాలు ఆహారంగా ఇస్తారు. ఇలా ఎంఏఎం పిల్లలు ఎనిమిది వారాలు, ఎస్ఎం పిల్లలు 16 వారాల్లో కోలుకోవాల్సి ఉంటుంది. అప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోతే ఆ పిల్లలను ఎన్ఆర్సీ (న్యూట్రీషన్ రీహాబిలిటేషన్ సెంటర్)కు పంపిస్తారు. అక్కడ వైద్య పరమైన సేవలతోపాటు పోషకాహారం ఇస్తూ పిల్లలు లోపాన్ని అధిగమించేలా చేస్తారు. పిల్లల కోసం ఇప్పటికే భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌ఏఎం, ఎంఏఎం పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులు, గ్రామాల ప్రజాప్రతినిధులకు ఇప్పటికే కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారు. ఆ మేరకు వారు పనిచేస్తున్నారు.

ప్రతినెలా వివరాలు నమోదు చేస్తున్నాం..



ప్రతినెలా పిల్లల ఎత్తు, బరువు చూసి ఆ వివరాలు నమోదు చేస్తున్నాం. ఎస్‌ఏఎం, ఎంఏఎం పిల్లలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. వారికి సరైన పోషకాహారం అందేలా చూస్తున్నాం. అంగన్‌వాడీకి రాకపోతే ఇంటికి వెళ్లి మరీ తీసుకొస్తున్నాం. ఇంట్లో సరైన ఆహారం పెడుతున్నారా? లేదా? అని నిత్యం ఆరా తీస్తున్నాం. మా కేంద్రంలో కొద్ది మంది పిల్లల్లో మాత్రమే ఈ సమస్య ఉంది.

– మాణిక్యమ్మ, అంగన్‌వాడీ సూపర్వైజర్, భద్రాచలం సెక్టార్

మూడు శాతం తగ్గింపు లక్ష్యం



దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏడాదికి మూడు శాతం చొప్పున కేసులను తగ్గిస్తూ 2026 నాటికి సున్నా ఎస్ఏఎం, ఎంఏఎం పిల్లలు ఉండేలా చేస్తున్నాం. అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు ఆశావర్కర్లు, గ్రామంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో ఇందుకోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. కేసులు తగ్గించడంలో అంగన్‌వాడీతోపాటు మిగిలిన వారికి అంతే బాధ్యత ఉంటుంది.

– సలోమి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి, దుమ్ముగూడెం

సమ్మేళనానికి సన్నాహక సమావేశం


సన్నాహక సమావేశంలో చర్చిస్తున్న పొంగులేటి వర్గీయులు

దమ్మపేట: మాజీ పార్లమెంట్ సభ్యులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి పొంగులేటి వర్గీయులు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం దమ్మపేట మండల కేంద్రంలో అశ్వారావుపేట నియోజకవర్గంలోని పొంగులేటి అభిమానులు, వర్గీయులు సమావేశాన్ని నిర్వహించి.. పొంగులేటి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి వర్గీయుడు జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. పొంగులేటి అభిమానులు ప్రతి ఒక్కరు తప్పనిసారిగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని జయప్రదం చేయవల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పొంగులేటి వర్గీయులు జారే ఆదినారాయణ, కోటగిరి సత్యంబాబు, రావు గంగాధరరావు, ప్రమోద్, జూపల్లి ఉపేంద్ర, యర్రగొర్ల రాధక్రిష్ణ, చిన్నశెట్టి యుగంధర్, రావు రవిశంకర్, చక్రాల మల్లేశ్వరరావు, చామర్తి గోపిశాస్త్రి, పండూరి వీరబాబు, సాయిల నర్సీ పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలుచేయాలి

చర్ల: ఆదివాసీల సంక్షేమం, రక్షణ కోసం రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఎ్మండలంలోని రాళ్లగూడెం (చర్ల)లో సీనియర్ నాయకులు యాలం నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1/70 చట్టం అమలుకు నోచుకోవడం లేదని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు భూమి పట్టాలు ఇస్తున్నారని అన్నారు. సమావేశంలో కేశవాపురం సర్పంచ్ కోరం నాగేంద్రబాబు నాయకులు కోరం సాయిరాం చింతా వెంకటేశ్ పూనెం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా అమలుచేయాలి

దుమ్ముగూడెం: ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నడికుడి గ్రామంలో అపక శ్రీను అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ1/70చట్టం ఏర్పడి 50 ఏళ్లు గడిచినప్పటికీ అడుగడుగునా 1/70చట్టం ఉల్లంఘనలు జరుగుతున్నాయని, దొడ్డిదారిన ఏజెన్సీలో అడుగుపెట్టిన గిరిజనేతరులకు పట్టాలు చేస్తున్నారని అన్నారు. వలస నిరోధక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కుర్సం మహేష్, పూనేం అజిత్, పూనేం కొండ బాబు, సాయిరాం, ముర్రం జంపన్న పాల్గొన్నారు.

సెమీస్‌కు ‘యూసుఫ్’ టోర్నీ



సెంచరీ చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న రాజు

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న 15వ యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ సెమీస్‌కు చేరింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బూర్గంపాడు మనీ ఎలెవన్ జట్టు భద్రాచలం స్పైడర్ ఎలెవన్ జట్టుపై విజయం సాధించింది. బూర్గంపాడు జట్టులోని రాజు 124 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ దమ్యాచ్ దక్కించుకున్నాడు. మరో క్వార్టర్ ఫైనల్‌లో బూర్గంపాడు బబ్బు ఎలెవన్ జట్టుపై పాల్వంచ శ్రీరామ్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. సాయంత్రం జరిగిన నాల్గో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కొత్తగూడెం బిల్లు ఎలెవన్ జట్టుపై అశ్వాపురం జెమిని ఎలెవన్ జట్టు విజయం సాధించింది. బుధవారం రెండు సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నట్లు నిర్వహాక కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సతీష్‌రెడ్డి మెమోరియల్ టోర్నీ..

యువత క్రీడా స్ఫూర్తితో జీవితంలో ముందుకు సాగాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో గత వారంరోజులుగా నిర్వహిస్తున్న సతీష్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నీ ముగింపు సభలో ఆమె పాల్గొని విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టోర్నమెంట్‌లో బూర్గంపాడు బబ్బు ఎలెవన్ జట్టు విజేతగా, ఎస్ఆర్‌పీ ఎలెవన్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. కార్యక్రమంలో నిర్వహాక కమిటీ ప్రతినిధులు ఆవుల నాగార్జునరెడ్డి, పాలం దివాకర్‌రెడ్డి, బాదం గణేష్‌రెడ్డి, యారం పున్నారెడ్డి, దుగ్గ శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉమ్మలరెడ్డి బాలశేఖర్‌రెడ్డి, చాగర్లమూడి జగదీష్, పేరం సంజీవరెడ్డి, పోతిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

గుండాల: గ్రామీణ ప్రాంతాల యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క తనయుడు దనసరి సూర్య, ఎంపీపీ ముక్తి సత్యంలు అన్నారు. గుండాల ఎంపీటీసీ సంధాని జ్ఞాపకార్థకంగా నిర్వహించిన క్రికెట్ టోర్నిలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టోర్నమెంటులో ప్రథమ బహుమతి ఆళ్లపల్లి మండలం బోడాయికుంట, ద్వితీయ బహుమతి టేకులపల్లి మండలం పాతర్లగడ్డ జట్లు గెలుచుకున్నారు. వారికి నగదుతో పాటు, షీల్డ్ అందించారు. కార్యక్రమంలో మామకన్ను సర్పంచ్ కొడెం ముత్యమాచారి, ఎంపీటీసీ క్రిష్ణారావు, ఉప సర్పంచ్ మానాల ఉపెందర్, ఎస్సై కిన్నెర రాజశేఖర్, వైద్యాధికారి మనేష్‌రెడ్డి, వివేవవర్ధని కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, కొడెం వెంకటేశ్వర్లు, కొమరం శాంతయ్య, దుర్గ, చోటు,ముఖేష్, ప్రసాద్, సంతోష్, పవన్, కిరణ్, అనీల్, సురేష్, నరేష్, జంపరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సమావేశం మరోసారి వాయిదా

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సమావేశం మంగళవారం డైరెక్టర్లు పూర్తి స్థాయిలో హాజరు కాక సమావేశం మరోసారి వాయిదా వేశారు. మంగళవారం మొండికుంటలోని సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా.. 11 మంది డైరెక్టర్లలో ఐదుగురు మాత్రమే హాజరుకావడంతో కోరం లేక వాయిదా వేశారు. మరల ఈ నెల 25వ తేదీన సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సంఘంలో జరిగిన అవకతవకలపై నిర్వహించాల్సిన ఈ సమావేశానికి డైరెక్టర్లు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేయాలి

చర్ల: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ట్రాక్టర్లను సీజ్ చేసి వాటిని నడుపుతున్న యజమానులపై కేసులు నమోదు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన చర్లలో గల పార్టీ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా గ్రావెల్, ఇసుక, మట్టి వంటి తోలకాలకు వినియోగిస్తున్న సగం ట్రాక్టర్లకు కనీస ఫిట్‌నెస్‌లు లేవని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు పాముల సాంబ, శివ, ప్రశాంత్, భాను ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సభతో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి


మణుగూరురూరల్: సభకు తరలనున్న నేతలతో విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: ఖమ్మంలో నేడు జరిగే భారీ బహిరంగ సభతో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితి ఏర్పాటయ్యాక ఖమ్మంలో తొలిసారిగా జరగబోయే ఈ సభ చారిత్మాత్మకమైందన్నారు. బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయన్నారు. సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు,ప్రజలు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం నుంచి సుమారు 15వేల మంది తరలించేందుకు 220 బస్సులను కేటాయించినట్లు తెలిపారు. అలాగే సుమారు వెయ్యికార్లతో ప్రజలు సభకు తరలిరానున్నారన్నారు.

భద్రాచలం: ఖమ్మంలో బుధవారం జరిగే బీఆర్‌ఎస్ జాతీయ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు, మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ కోరారు. మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సీఎం కేసీఆర్‌తో పాటుగా కేరళ, పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు, ఇతర జాతీయ నాయకులు పాల్గొనే ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బీఆర్‌ఎస్ ఎజెండాను ప్రకటించి ఈ సభకు నియోజకర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: నేడు ఖమ్మంలో తలపెట్టిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించాక బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన తొలి సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివెళనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పర్సావెంకటేశ్వర్లు, జంగాల ఉమ, చల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు దుస్తుల పంపిణీ


బూర్గంపాడు: ఆదివాసీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

బూర్గంపాడు: మోతె పట్టీనగర్ గ్రామపంచాయతీలోని విజయ్‌గుంపుకు చెందిన ఆదివాసీలకు మంగళవారం బూర్గంపాడుకు చెందిన సాయిరామ్ ప్లెయాష్ బ్రిక్స్ యజమాని వీరంరెడ్డి రామాంజిరెడ్డి దుస్తులను పంపిణీ చేశారు. ఐటీసీ కాంట్రాక్టర్, సామాజిక వేత్త పాకాల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా ఆదివాసీ కుటుంబాలకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, ఎం నాగరాజు, సాయికిరణ్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా..

అశ్వారావుపేటరూరల్: నామా ముత్తయ్య ట్రస్టు ద్వారా మంగళవారం పేదలకు దుప్పట్లు వితరణగా అందించారు. మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ కానుకగా సుమారు 100 కుటుంబాలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు మారుతి లలిత, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, జుజ్జూరి వెంకన్నబాబు, ఉప్పల ప్రసాద్, ఉప్పల మురళి, రామినేని సత్యనారాయణ, చెన్నారావు, రాంబాబు, లోకం సాంబశివరావు, పానుగంటి లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వరరావు, నారం జగదీష్, సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.

కేసు నమోదు

దుమ్ముగూడెం: మద్యంమత్తులో చిరువ్యాపారిని దుర్భాషలాడి చంపుతానని బెదిరించినట్లు అందిన ఫిర్యాదుపై లక్ష్మీనగరం గ్రామానికి చెందిన యండి.పాషాపై కేసు నమోదైంది. ఎస్సై రవికుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ముఖేష్ లక్ష్మీనగరం గ్రామంలో తోపుడు బండిపై సమోసాలు, జిలేబీలు విక్రయిస్తుంటాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి సమయంలో మద్యం మత్తులో అక్కడికి వెళ్లిన పాషా.. సమోసాలు తీసుకున్నాడు. వాటికి సంబంధించిన డబ్బులు అడిగినందుకు దౌర్జన్యం చేసి చంపుతానని పాషా బెదిరించాడని బాధితుడి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆటో–ద్విచక్రవాహనం ఢీ

అశ్వారావుపేటరూరల్: ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలు కాగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మంగళవారం వినాయకపురం గ్రామానికి చెందిన గజ్జల హేమంత్, సుమంత్, తేజేశ్వర్ కలిసి ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మండల పరిధిలోని వినాయకపురం వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించే క్రమంలో దానిని ఢీ కొట్టారు. దాంతో ఆటోలో ఉన్న వినాయకపురం కాలనీకు చెందిన గద్దం శ్రీను, సత్యసాయికు గాయాలయ్యాయి. గజ్జల హేమంత్ తలకు బలమైన గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికు తరలించగా, హేమంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్సై రాజేశ్ కుమార్ తెలిపారు.

ప్రమాదంలో దంపతులకు గాయాలు

దమ్మపేట: గుర్తుతెలియని మినీట్రక్ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దంపతులకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మంగళవారం సాయంత్రం 6 గంటల సమయయంలో ఇల్లెందుకు చెందిన దాస్యం రాంబాబు (40) తన భార్య సుమలత, కూమార్తె కలసి ద్విచక్ర వాహనంపై ఇల్లెందు నుంచి ఆంధ్ర రాష్ట్రంలోని జీలుగుమిల్లి గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు మండల పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామం చెరుకోగానే వెనుక నుంచి గుర్తు తెలియని మినీట్రక్ ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాద సంఘటనలో వారు ఒక్కసారిగా రోడ్డు మీద పడటంతో స్వల్పకాలిక గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి, దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు.

డైరీ ఆవిష్కరణ

మణుగూరురూరల్: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో టీఈఈ–1104 ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం–2023 డైరీని మంగళవారం బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న ఆవిష్కరించారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం సీఈని యూనియన్ బీటీపీఎస్ రీజినల్ ప్రెసిడెంట్ హేమ్లా నాయక్, నాయకులు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, అజ్మీర వెంకట్రామ్, సాంబశివరావు, సునీత పాల్గొన్నారు.

కంటివెలుగును విజయవంతం చేయాలి

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళి, డాకర్ పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటివెలుగును ఉపయోగించుకోవాలన్నారు. కేంద్రం దగ్గరకు వచ్చేటప్పుడు ఆధార్, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుల్లో ఏదో ఒకటి తమ వెంట తీసుకునిరావాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్, యంపీఓ ముత్యాలరావు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: రెండో విడత కంటి వెలుగు కరపత్రాలను గ్రామాల్లో వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. మంగళవారం మండల వైద్యాధికారి ప్రియాంక కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ నెల 19 నుంచి మే 25 వరకు మండలంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మణుగూరురూరల్: కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి అలీమ్

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కంటివెలుగు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైద్యాధికారి శివకుమార్, నేత్ర వైద్యులు సంజీవరావు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పలు కంటివెలుగు పరీక్షా కేంద్రాలను జిల్లా ప్రత్యేక అధికారి ఎంఏ అలీమ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు, వైద్యులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైద్యాధికారి శివకుమార్, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అన్నపురెడ్డిపల్లి: కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక

ఎమ్మెల్యేకు ఆహ్వానం

దమ్మపేట: కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభోత్సవానికి విచ్చేయాలని స్థానిక ఎమ్మెలే మెచ్చా నాగేశ్వరరావుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసం తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. రేపు (గురువారం) దమ్మపేట మండల కేంద్రంలోని స్థానిక సెయింట్ మేరిస్ పాఠశాలలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి హాజరై ప్రారంభించాల్సిందిగా ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామరావు సిబ్బంది పాల్గొన్నారు.